క్లుప్తంగా

11 నుంచి నిరవధిక సమ్మె



సమ్మె నోటీసును అందజేస్తున్న నాయకులు

హుస్నాబాద్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఈనెల 11వ తేదీన జరిగే నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ పిలుపునిచ్చారు. ఈసందర్భంగా శుక్రవారం సమ్మె నోటీసును సీడీపీఓ జయమ్మకు అందజేశారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలి

సిద్దిపేటకమాన్: విద్యా సామర్థ్యాలు అందించడం ప్రభుత్వం బాధ్యతగా గుర్తించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2021–22 పర్మామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ నివేదిక ప్రకారం రాష్ట్రం దేశంలో 31వ స్థానంలో నిలిచిందన్నారు. విద్యా ప్రమాణాల పెంపుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాస తీర్మానం సరికాదు



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ సుమలత

మద్దూరు(హుస్నాబాద్): నాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం ఎంపీపీ కృష్ణారెడ్డికి తగదని మద్దూరు వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలత మల్లేశం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆమె మాట్లాడుతూ.. ఎంపీపీ తన పదవికి రాజీనామా చేసి మళ్లీ గెలవాలని సవాల్ విసిరారు. బీసీ మహిళను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని కన్నీరు పెట్టారు. బీఆర్ఎస్ అధిష్టానం ఎవరికి టికెట్ కేటాయిస్తే వారి గెలుపునకు కృషి చేస్తామని పేర్కొన్నారు. మంత్రి హరీశ్‌రావు పేరు చెప్పుకొని నాయకులను అయోమయానికి గురిచేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో మద్దూరు, దూళ్మిట్ట మండల అధ్యక్షులు మేక సంతోష్‌కుమార్, మంద యాదగిరి, సర్పంచ్‌లు సుందరగిరి స్రవంతి పర్శరాములు, దీపిక వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు రాజమల్లయ్య, వెంకట్‌గౌడ్, మమత, అరుణ, సొసైటీ డైరెక్టర్లు మల్లేశం, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.


దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించండి



మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దుబ్బాకటౌన్: శాసనసభ ఎన్నికలలోపే దుబ్బాక రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసేలా కృషి చేయాలని శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డిని జేఏసీ నాయకులు కలిసి విన్నవించారు. ఈసందర్భంగా జేఏసీ అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఎన్నికలలోపే సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం దుబ్బాక రెవెన్యూ డివిజన్ ఏర్పాటు విషయంలో ఇప్పటికే అన్ని విధాలుగా కసరత్తు చేస్తుందన్నారు. త్వరలోనే ప్రకటన వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రాజేష్, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న అధ్యాపకులు

సిద్దిపేట ఎడ్యుకేషన్: కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని శుక్రవారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ హాజరై మాట్లాడారు. కాళోజీ తెలంగాణ యాస, భాష కోసం జీవితాంతం పరితపించారని పేర్కొన్నారు. తెలుగు విభాగం ప్రతి ఏడాది ఇచ్చే కాళోజీ పురస్కారాన్ని శ్యామల, నిఖితకు అందజేశారు. కార్యక్రమంలో అకాడమీ కోఆర్డినేటర్ గోపాల సుదర్శనం, చరిత్ర విభాగాధిపతి శ్రీనివాస్, అర్థశాస్త్ర అధ్యాపకులు శ్రద్ధానందం, తదితరులు పాల్గొన్నారు.



ఆదమరిస్తే అంతే..!

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం నుంచి రాజీవ్ రహదారికి వెళ్లే దారిలో వ్యవసాయ బావి ప్రమాదకరంగా మారింది. నిత్యం వందలాది వాహనాలు, భక్తులు ఈరోడ్డు గుండా ప్రయాణిస్తారు. అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, రక్షణ గోడ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

\- కొమురవెల్లి(సిద్దిపేట)



పందులు.. తప్పని తిప్పలు

దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట వార్డులో పందులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. వానాకాలం కావడంతో వ్యాధులు ప్రబలే అవకాశముందని.. అధికారులు స్పందించి పందుల బెడదను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. - దుబ్బాక

ఎన్నికలకు ముందస్తు ప్రణాళిక



ములుగులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

వర్గల్/ములుగు(గజ్వేల్): ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అడిషనల్ డీసీపీ (అడ్మిన్) అందె శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రం వర్గల్‌లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని గజ్వేల్ ఏసీపీ రమేష్, రూరల్ సీఐ జానకిరామ్‌రెడ్డి, గౌరారం ఎస్సై విజయభాస్కర్‌తో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బార్డర్ జిల్లాల పోలీస్ అధికారులను సమన్వయం చేసుకుని స్థానిక పోలీస్ అధికారులు విధులు నిర్వర్తించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. అనంతరం ములుగులోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

గొర్రెల పంపిణీ పూర్తి చేయాలి

గజ్వేల్‌రూరల్: డీడీలు కట్టిన లబ్ధిదారులందరికీ గొర్రెల పంపిణీ చేయాలని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్‌యాదవ్, బీజేపీ జిల్లా కార్యదర్శి కుడిక్యాల రాములు, నాయకులు నత్తి శివకుమార్, మన్నె శేఖర్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్వేల్‌లో వారు మాట్లాడుతూ.. ఎన్నికలు వచ్చినప్పుడే గొర్రెల పంపిణీ పథకాన్ని తెరపైకి తెస్తూ గొల్ల, కురుమలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు మహిపాల్‌యాదవ్, రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సిద్దిపేటలో కవి సమ్మేళనం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రజాకవి కాళోజీ జయంతి సందర్భంగా శనివారం సిద్దిపేటలో మహాసభ, కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు వెన్నెల సాహితీ సంగమం అధ్యక్షుడు వంగర నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి పర్కపెల్లి యాదగిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కవులు, రచయితలు, సాహితీ అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

కొత్త రుణాలు అందించండి

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ రూ. లక్ష రుణమాఫీ వర్తింపచేసి, కొత్త రుణాలు అందించేలా ఆదేశాలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట సీపీఎం, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి బ్యాంక్ మేనేజర్ శ్రీలతకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, శ్రీనివాస్, చందు, మల్లేశం, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలు జయప్రదం చేయండి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఈనెల 11వ తేదీ నుంచి 22 వరకు జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న రిలే నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఇన్‌చార్జి యాదగిరి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముండ్రాతి కృష్ణ, మాదిగ విద్యార్థి సమాఖ్య జిల్లా ఇన్‌చార్జి సామ్రాట్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

సిద్దిపేటజోన్: ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని మంత్రి హరీశ్‌రావు ప్రత్యేకంగా రెండు ఫాగింగ్ మిషన్లు మంజూరు చేశారని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ సంపత్, వైస్ చైర్మన్ కనకరాజుతో కలిసి మిషన్లను ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

జీపీ పరిశీలన

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ గ్రామ పంచాయతీ నిర్వహణ తీరును గజ్వేల్ ఆర్డీఓ బన్సీలాల్ శుక్రవారం పరిశీలించారు. పంచాయతీ రికార్డులు, పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. ఓటు హక్కు నమోదుపై సర్పంచ్ కిరణ్‌కుమార్‌చారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ కనకయ్య, పంచాయతీ కార్యదర్శి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆలయాల్లో శ్రావణ సందడి

చిన్నకోడూరు(సిద్దిపేట): శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం చిన్నకోడూరుతో పాటు పలు గ్రామాల్లోని ఆలయాల్లో సందడి నెలకొంది. ఈసందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



క్రీడాకారులతో వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): క్రీడల్లో గెలుపోటములు సహజమేనని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. జగదేవ్‌పూర్‌లో శుక్రవారం జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడాకారులు తమలోని ప్రతిభను చాటుకునేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. క్రీడలతో శారీరక ధారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. క్రీడారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఈసందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేశంగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు నరేష్, నాచారం దేవాలయ కమిటీ డైరెక్టర్ నాగరాజు, మండల కోఆప్షన్ సభ్యుడు ఎక్బాల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఎంఈఓ ఉదయభాస్కర్‌రెడ్డి, పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మాక్ పోలింగ్



ఓటు వేయడానికి బారులు తీరిన విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని అందె ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల విధులపై ఉపాధ్యాయులు ప్రత్యక్ష పద్ధతిలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాక్ పోలింగ్ విద్యార్థులకు ఎంతో దోహదం చేస్తుందని హెచ్‌ఎం అంజిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహారెడ్డి, అంజుకుమార్, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, గౌస్ మియా, అజయ్ కుమార్, విజయ్‌కుమార్, అశోక్ పాల్గొన్నారు.

జీ 20 సమావేశాలు విజయవంతం కావాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

గజ్వేల్‌రూరల్: జీ 20 శిఖరాగ్ర సమావేశాలు విజయవంతం కావాలని సెయింట్ మేరీస్ విద్యానికేతన్‌కు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు శుక్రవారం ప్రజ్ఞాపూర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా కరస్పాండెంట్ గోపు ఇన్నారెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ అధ్యక్షతన జరగనున్న 18వ సమావేశాలు దేశానికే గర్వకారణమని కొనియాడారు. సమావేశాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కాట రాయప్ప, ఎన్‌సీసీ ఇన్‌చార్జి వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా కృష్ణాష్టమి

దౌల్తాబాద్: గోపిక, కృష్ణుడి వేషధారణలో విద్యార్థులు

దౌల్తాబాద్(దుబ్బాక)/బెజ్జంకి: కృష్ణాష్టమి వేడుకలను శుక్రవారం గాజులపల్లి ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు గోపిక, బాలురు కృష్ణుడి వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, ఎస్ఎంసీ చైర్మన్ దశరథం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే బెజ్జంకి మండలంలోని ముత్తన్నపేట ప్రాథమిక పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేశం, కార్యదర్శి రాజేందర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ లక్ష్యం



ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది

దౌల్తాబాద్(దుబ్బాక): మాతా శిశు సంపూర్ణ ఆరోగ్య రక్షణే లక్ష్యంగా పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ చంద్రకళ, తహసీల్దార్ సుజాత తెలిపారు. శుక్రవారం తిర్మలాపూర్ రైతు వేదికలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈనెల చివరి వారం వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశకార్యకర్తలు గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలకు బాలామృతం ప్రతీరోజు అందించాలన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు తాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఇందుప్రియాల్ పీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్, ఎంపీటీసీ బండారు దేవేందర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గిరిజ, పోషణ్ అభియాన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ రామకృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రతీ ఒక్కరు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ సీఐ రామకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్ఆర్‌కే డిగ్రీ కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని సూచించారు. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపవద్దన్నారు. మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేటప్పుడు సీటు బెల్టు ధరించాలని చెప్పారు. వాహనదారుల్లో మార్పు వచ్చినప్పుడే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజశేఖర్, విద్యార్థులు, పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి మంత్రి భరోసా



బాధిత కుటుంబంతో బీఆర్ఎస్ నాయకులు

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని దుద్దెడకు చెందిన పల్లె రవి, మౌనిక కుమార్తె అమూల్య బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న మండల రైతు బంధు కోఆర్డినేటర్ దుర్గయ్య, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్ శుక్రవారం మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి వెంటనే హైదరాబాద్‌లోని కేన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ జయలతకు ఫోన్ చేసి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

సంక్షిప్త వార్తలు

◆ **సన్మానం**

చేర్యాల(సిద్దిపేట): స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైన పెద్దమ్మగడ్డ ఎంపీపీఎస్ విద్యార్థిని శృతిని శుక్రవారం ఉపాధ్యాయులు సన్మానించారు. శృతి కరీంనగర్ జిల్లా స్పోర్ట్స్ స్కూల్‌లో అడ్మిషన్ పొందింది. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం ఐలయ్య, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

◆ **వాల్ పోస్టర్ ఆవిష్కరణ**

హుస్నాబాద్: హైదరాబాద్‌లో బీసీ సంహగర్జనకు సంబంధించి శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. బీసీ జనాభా దామాషా ప్రకారం రాజకీయపరంగా 119 సీట్లలో 60 సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

◆ **గొర్రెల పంపిణీ**

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని చిట్యాలలో శుక్రవారం గ్రామానికి చెందిన 32 మంది లబ్ధిదారులకు సర్పంచ్ ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు గొర్రెలను పంపిణీ చేశారు.

◆ **దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి**

వర్గల్(గజ్వేల్): సంగారెడ్డిలో ఎస్ఎఫ్ఐ నాయకులపై దాడికి పాల్పడిన ఏబీవీపీ నాయకులను అరెస్ట్ చేయాలని వర్గల్ మండల ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు శివకుమార్ డిమాండ్ చేశారు. దాడి ఘటనను ఖండిస్తూ శుక్రవారం వర్గల్‌లో నిరసన వ్యక్తం చేశారు.

◆ **రాయపోలు ఎస్సై బాధ్యతల స్వీకరణ**

రాయపోలు(దుబ్బాక): రాయపోలు ఎస్సై రఘుపతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన మహబూబ్ బదిలీపై వెళ్లారు.

◆ **తొగుట ఎస్ఐగా లింగం**

తొగుట(దుబ్బాక): తొగుట ఎస్ఐగా లింగం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన కర్ణాకర్‌రెడ్డి మహబూబాబాద్‌కు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ప్రజలు తమ సమస్యలపై తనను నేరుగా కలవాలని సూచించారు.

◆ **ఉప్పలమ్మకు ముడుపు**

చేర్యాల(సిద్దిపేట): మూడోసారి కేసీఆర్ సీఎం కావాలని, జనగామ ఎమ్మెల్యేగా ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి గెలవాలని కోరుతూ చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ యార్డులోని ఉప్పలమ్మ దేవతకు మార్కెట్ పాలకవర్గ సభ్యులు శుక్రవారం ముడుపు కట్టారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

◆ **నూతన నియామకం**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని ముత్తన్నపేట గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కర్రావుల సందీప్‌ను నియమించినట్లు యూత్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

◆ **బీఆర్ఎస్‌కు మద్దతుగా తీర్మానం**

కొండపాక(గజ్వేల్): మండలంలోని విశ్వనాథపల్లిలో సీఎం కేసీఆర్ వెంటే ఉంటామని గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈసందర్భంగా శుక్రవారం ఎంపీటీసీ చింతల సాయిబాబతో కలిసి మండల రైతు బంధు కోఆర్డినేటర్ దుర్గయ్యకు తీర్మాణ ప్రతిని అందజేశారు.

◆ **కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు**

కోహెడ(హుస్నాబాద్): కాంగ్రెస్‌తోనే పేదలకు అన్ని రంగాల్లో న్యాయం జరగనుందని జాతీయ యువజన కాంగ్రెస్ కోఆర్డినేటర్ ఇల్తాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో డోర్ టూ డోర్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మజీద్, శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శివారెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

◆ **ఐకమత్యంతోనే అభివృద్ధి**

నంగునూరు(సిద్దిపేట): గౌడ కులస్తులు ఐకమత్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమౌతుందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లింగంగౌడ్ అన్నారు. సిద్దిపేటలోని రేణుకా ఎల్లమ్మ కల్యాణ మండప ఆవిష్కరణ కరపత్రాన్ని శుక్రవారం నంగునూరులో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహేందర్‌గౌడ్, రాజుగౌడ్, ఉప్పలయ్య, మహేందర్, చంద్రయ్య, రాములు, తదితరులు పాల్గొన్నారు.

◆ **ఏబీవీపీ దిష్టిబొమ్మ దహనం**

గజ్వేల్‌రూరల్: ఎస్ఎఫ్ఐ నాయకులపై దాడిచేసిన ఏబీవీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని గజ్వేల్ ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో శుక్రవారం ఏబీవీపీ దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో గజ్వేల్ ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రవీణ్, ప్రణయ్, భరత్, విష్ణు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **సిద్దిపేటలో డ్రైడే**

సిద్దిపేటజోన్: పట్టణంలోని 5వ వార్డులో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ సంపత్ డ్రైడేలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లలోని పూల కుండీలు, పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు.

◆ **వైభవంగా బండ్ల బోనాలు**



చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో బండ్ల బోనాలను వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ప్రారంభమైన కార్యక్రమం ఆదివారం పోచమ్మ బోనాలతో ముగుస్తుంది. మొదటి రోజు మహిళలు మహంకాళీ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, వైస్‌చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

◆ **ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలి**

సిద్దిపేటరూరల్: విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలని ఎస్ఐ కిరణ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం నారాయణరావుపేట మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు రక్షణ చట్టాలు, తదితర వాటిపై అవగాహన కల్పించారు.

◆ **అర్హులు ఓటరుగా నమోదు చేసుకోండి**

దుబ్బాక: 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్క రు ఓటరుగా నమోదు చేసుకోవాలని దుబ్బాక తహసీల్దార్ జయంత్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేట కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించారు.